సాక్షి
నిర్మల్
ఆదివారం • 1 • జనవరి • 2023











నయా జోష్..

కొన్ని మెరుపులు.. కొన్ని మరకలతో 2022 కాలగర్భంలో కలిసిపోయింది. కొత్త ఏడాది 2023కు జిల్లా వాసులు ఘనంగా స్వాగతం పలికారు. రాత్రి 10 గంటల నుంచే జిల్లా వ్యాప్తంగా సంబురాలు ప్రారంభమయ్యాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా అంతా ఒక్కచోట చేరి వేడుకలు జరుపుకున్నారు. డీజే పాటలకు నృత్యాలు చేశారు. అర్ధరాత్రి 12 గంటలకు లైట్లు ఆర్పేసి 2022కు వీడ్కోలు పలికారు. వెలుగు జిలుగులతో బాణాసంచా కాలుస్తూ 2023కు స్వాగతం పలికారు. కేకలు కట్‌చేశారు. ఉదయం పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. సోఫీ నగర్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

న్యూస్‌రీల్

సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ ఎత్తేస్తాం



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ ఎత్తేస్తామని నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయం ఆవరణంలో రౌడీ షీటర్లకు శనివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. గొడవలకు పాల్పడి క్రిమినల్ కేసుల్లో చిక్కుకోవద్దని హెచ్చరించారు. సత్ప్రవర్తతో జీవిస్తూ తదుపరి క్రిమినల్ కేసుల్లో చిక్కుకోకుండా ఉంటే రౌడీషీట్ మూసివేసే విషయం సమీక్షిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శ్రీనివాస్, రూరల్ సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

యువతి ఆచూకీ లభ్యం



యువతిని అప్పగిస్తున్న పోలీసులు

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సూర్యవంశీ శృతిలయ ఆచూకీ లభించినట్లు రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గురువారం అర్ధరాత్రి నుంచి శృతిలయ కనిపించకపోవడంతో ఆమె కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చేపట్టారు. కుంటాల మండలం దొనెల్లి వద్ద ఉన్నట్లు శనివారం సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి యువతిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం ఆమెను కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై గంగారాం, ఎంపీటీసీ అశోక్ పాల్గొన్నారు.


అండరార్మ్ క్రికెట్‌లో గోల్డ్ మెడల్



గోల్డ్‌మెడల్‌తో యువతి నిఖిత

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీకి చెందిన జక్కుల భీమన్న కూతురు నిఖిత అండరార్మ్ మహిళా క్రికెట్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించింది. పంజాబ్‌లో ఇటీవల జరిగిన అండరార్మ్ క్రికెట్ ఫెడరేషన్ కప్ 2022 మహిళా విభాగం నుంచి అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. నిరుపేద కుటుంబానికి చెందిన యువతి బంగారు పతకం సాధించడంపై స్థానికులు, క్రీడాకారులు అభినందించారు.

కడెంలో పర్యాటకుల సందడి



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

కడెం: వారాంతం, ఏడాది ముగింపు సందర్భంగా కడెం ప్రాజెక్టు పరిసరాలు శనివారం పర్యాటకులతో సందడి మారాయి. హైదరాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు హరిత రిసార్ట్స్‌లో విడిది చేశారు. రోజంతా ఆట, పాటలతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి బోటు షికారు చేశారు.

అభివృద్ధిపై కొత్త ఆశలు!

2023

- నయసాల్‌లో సరికొత్త లక్ష్యాలు
- సాధిస్తామంటున్న పాలకులు, అధికారులు
- ఆ దిశగా వడివడిగా అడుగులు

నిర్మల్:గడిచిన 12 నెలల్లో జిల్లా పలు రంగాల్లో అభివృద్ధి చెందింది. జిల్లా ఆవిర్భవించిన ఆరేళ్లలో అనేక అంశాల్లో పురోగమిస్తోంది. పురోగమన అంశాలు కళ్లముందు కదలాడుతున్నాయి. వైద్య కళాశాల, భైంసా మీదుగా బాసర వరకు కొత్త హైవే, సోన్‌కు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ, పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే ద్వితీయస్థానం, వైద్యరంగంలో పురస్కారాలు ఇలా ఏడాది మొత్తం అభివృద్ధి సాగింది. బైబై..అంటూ 2022ను సాగనంపుతూ, హాయ్ హాయ్.. అని 2023ను హత్తుకుని జిల్లా ఆహ్వానం పలికింది. ఈ ఏడాది జిల్లాకు ఆసక్తికరంగానే కనిపిస్తోంది. మరికొన్ని నెలల్లోనే ఎన్నికల వాతావరణం మొదలుకానుంది. ఈనేపథ్యంలో పాలకులు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులన్నీ ఈ యేడు పూర్తికానున్నాయి. కొత్తగా కేటాయించే నిధులు, పథకాలతో సామాన్యుడికీ కొంతైనా లాభం చేకూరే అవకాశాలున్నాయి. ఇలాంటి తరుణంలో జిల్లావాసులతోపాటు పాలకులు, అధికారులూ తమకంటూ కొత్త ఏడాదిలో కొన్ని లక్ష్యాలను పెట్టుకుంటున్నారు. శాయశక్తులా కృషిచేసి వాటిని సాధిస్తామంటున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ ముషరఫ్‌అలీ, ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌లతోపాటు పలువురిని 'సాక్షి' పలకరించింది. కొత్త ఏడాది లక్ష్యాలు, చేయాల్సిన పనులు వెల్లడించారు.

మరింత అభివృద్ధి



జిల్లావాసులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. కొత్త సంవత్సరం మరింత ప్రత్యేకంగా ఉండనుంది. నాలుగేళ్లుగా చేపడుతున్న అభివృద్ధి పనులన్నీ పూర్తికానున్నాయి. మరింత సంక్షేమం ప్రజలకు అందనుంది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న మెడికల్‌కాలేజీ పనులతోపాటు జిల్లా, ప్రసూతి ఆస్పత్రులకూ పూర్తిసదుపాయాలతో భవనాలు ప్రారంభం కానున్నాయి. అన్ని శాఖలు ఒకే దగ్గర ఉండేలా సమీకృత కలెక్టరేట్ కొద్దిరోజుల్లోనే ప్రారంభమవుతోంది. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. పంటసాగుపై దృష్టిపెట్టిన ప్రభుత్వం సోన్ మండలంలో ఫ్యాక్టరీని ప్రారంభించనుంది. మనఊరు-మనబడి కింద 50 శాతం సర్కారు స్కూళ్లు పూర్తి ఫర్నిచర్‌తో అందుబాటులోకి రానున్నాయి. ఈనెల 10న ప్రతీ మండలంలో రెండుస్కూళ్లను ప్రారంభించడంతోపాటు ఆదేరోజు తొలిసారి నిర్మల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌ను ప్రారంభించేందుకు విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి రానున్నారు. సాగునీటి ఇబ్బందులు లేకుండా కాళేశ్వరం ప్యాకేజీ-27 పనులు మామడ వరకు పూర్తికానున్నాయి. అలాగే స్వర్ణ, దోనిగాం ప్రాజెక్టులకు ఎస్సారెస్పీ నీళ్లందించనున్నాం. మరో 6-7 చెక్‌డ్యామ్‌లు కొత్తగా నిర్మించనున్నాం. విద్య, వైద్యం, వ్యవసాయంతోపాటు మిషన్ భగీరథ, రైతుబంధు, ఆలయాలు, డబుల్‌బెడ్రూం ఇళ్లు తదితర పనులు, పథకాలనూ విజయవంతంగా అమలుచేస్తాం. అలాగే ప్రభుత్వం స్థలం ఉన్నవాళ్లకు రూ.3 లక్షల వరకు ఇవ్వాలన్న పథకాన్ని తీసుకురానుంది. ఈఏడాది రాజకీయంగానూ చాలా ముఖ్యమైంది. బీఆర్‌ఎస్‌ను జిల్లాతోపాటు పక్కనున్న మహారాష్ట్రలోనూ మరింత బలోపేతం చేస్తాం. పార్టీ జిల్లా కార్యాలయాన్నీ త్వరలోనే ప్రారంభిస్తాం.

- అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి

పిల్లలు, మహిళల సంరక్షణ కోసం..



కొత్త సంవత్సరంలో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలను మరింత తగ్గించడం, రోడ్డు ప్రమాదాల నివారణ, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తిచేయించడంతోపాటు శాఖాపరంగా కాగిత రహిత సేవలను పెంచడం లక్ష్యాలుగా అనుకుంటున్నాం. ఈ ఏడాది కూడా ప్రజల సహకారంతో మతపరమైన ఘటనలకు తావులేకుండా కృషిచేస్తాం. గత ఏడాది ఎనిమిదిమంది నేరస్తులకు జీవిత ఖైదు పడేలా చేశాం. ఈ ఏడాది కేసుల విచారణ త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తాం. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తూ రోడ్డు ప్రమాదాలను క్రమంగా తగ్గించేందుకు కృషిచేస్తాం. ప్రధానంగా మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు లేకుండా ప్రతీఒక్కరు కృషిచేయాల్సిన అవసరం ఉంది. ఎన్నికలు రానున్నందున ప్రజలందరి సహకారంతో కొత్త ఏడాదిలోనూ శాంతిభద్రతల పరిరక్షణ సవ్యంగా పూర్తిచేస్తాం.

- ప్రవీణ్‌కుమార్, ఎస్పీ

పెండింగ్ లేకుండా పూర్తిచేస్తాం..



కొత్త ఏడాదిలో ఒకటి కాకుండా రెండుమూడు లక్ష్యాలున్నాయి. ప్రధానంగా మనఊరు-మనబడి, ఆయిల్‌పామ్ సాగు పెంచడం, ఫ్యాక్టరీ పనులు, అటవీ పునరావాస గ్రామాలు, డబుల్‌బెడ్రూం ఇళ్లను అందించడం లక్ష్యంగా పెట్టుకుంటాం. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ వల్ల జిల్లాతోపాటు నిజామాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాలకూ లబ్ధి చేకూరనుంది. దాదాపు వెయ్యి నుంచి రెండువేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించనుంది. సంక్రాంతిలోపు నిర్మల్‌లో డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీ ప్రక్రియ పూర్తిచేస్తాం. భైంసా, ఖానాపూర్‌లోనూ విచారణ ప్రక్రియ పూర్తిచేశాం. అక్కడ కూడా లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను పంపిణీ చేస్తాం. కవ్వాల్ అభయారణ్యంలో పునరావాస గ్రామాలైన రాంపూర్, మైసంపేట్ కొత్త గ్రామాల పని త్వరితగతిన పూర్తిచేస్తాం. టెండర్లు పూర్తిచేసి, సంక్రాంతిలోపు భూమిపూజ చేస్తాం. రాష్ట్రంలోనే ఆస్పత్రుల్లో డెలివరీలు, అందులోనూ సాధారణ కాన్పుల సంఖ్యను పెంచడంలో ముందుభాగంలో ఉన్నాం. ఈ ఏడాది మరిన్ని సాధారణ డెలివరీలు జరిగేలా చూస్తాం. వైద్యుల హాజరుశాతం పెంచడం, వైద్యసేవలను అందించడంలోనూ రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉన్నాం. ఫిబ్రవరి నుంచి ట్రిపుల్‌ఐటీలో అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా మెస్‌లను నిర్వహించనున్నాం. పర్యాటకపరంగా, ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం పెంచేలా మార్పు తెస్తాం. రూ.12 కోట్లతో హరిత హోటల్ నిర్మించనున్నాం. కంచెరోని చెరువులో బోటింగ్ కూడా ఏర్పాటు చేయనున్నాం. ప్రజల సహకారంతో అన్ని పనులూ పూర్తిచేస్తాం. జిల్లా వాసులందరికీ హ్యాపీ న్యూ ఇయర్.

- ముషరఫ్‌అలీ ఫారూఖీ, కలెక్టర్

ఉద్యోగ సాధనే లక్ష్యం..



నిర్మల్: ఈ ఏడాది నోటిఫికేషన్లు బాగానే వస్తున్నాయి. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించడమే లక్ష్యం. ఇందుకోసం పూర్తిస్థాయిలో మెటీరియల్ సమకూర్చుకుని, ఈ ఏడాది పూర్తిగా ప్రిపేరేషన్‌పైనే దృష్టిపెడతా.

- బి. సారిక, పీజీ విద్యార్థిని, నిర్మల్

సేవాకార్యక్రమాలు పెంచుతాం..



కొత్త ఏడాదిలో మరింతగా సేవా కార్యక్రమాలను పెంచుతాం. ఇప్పటికే వందలమందికి రక్తదానం చేశాం. ఈ ఏడాదిలో మరింతమందికి మావంతుగా సాయం అందించడమే లక్ష్యం. రక్తదానంతో పాటు పేదలకు ఆర్థికసాయం, ఫుడ్ బ్యాంక్ ద్వారా ఆహారం అందించేలా చూస్తాం.

- నిగులపు సంజీవ్, నిర్మల్

క్రీడల్లో రాణిస్తా..



ఆటలంటే చాలా ఇష్టం. క్రికెట్‌తో సహా అన్ని ఆటల్లో ప్రావీణ్యం పెంచుకున్నాను. ఇప్పటి వరకు రాష్ట్ర, జాతీయ పోటీల్లో రాణించాను. ఇక అంతర్జాతీయ స్థాయిలో గెలవడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. ఇందుకు కాసింత ఆర్థికసాయం కావాలి.

- జే.నిఖిత, డిగ్రీ విద్యార్థిని, ఖానాపూర్

అర్హులందరికీ రైతుబంధు ఇవ్వండి

- సీఎస్‌ను కోరిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



సీఎస్‌కు విన్నవిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: అర్హులైన రైతులందరికీ రైతుబంధు వచ్చేలా చూడాలని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సీఎస్ సోమేశ్‌కుమార్‌ను కోరారు. హైదరాబాద్‌లో శనివారం సీఎస్‌ను కలిశారు. ముథోల్ నియోజకవర్గంలో పలువురు రైతులు సాంకేతిక కారణాలతో రైతుబంధుకు దూరమవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం చెరువులు, కాలువలు, రోడ్ల అభివృద్ధికి కొంత భూమి సేకరించి, మిగతా భూమి హోల్డ్‌లో పెట్టడంతో రైతులు రైతుబంధుకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ఈ మేరకు కలెక్టర్, వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి నివేదిక కూడా పంపించారని తెలిపారు. స్పందించిన సీఎస్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యవర్గం



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్, అశోక్

నిర్మల్ రూరల్: టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల భవనంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి శంకర్, ప్రధాన కార్యదర్శిగా పెంట అశోక్, ఉపాధ్యక్షులుగా మనోహర్‌రెడ్డి, సుజాత, కోశాధికారిగా కూర్మి నాగయ్య, కార్యదర్శులుగా రమేష్, బక్కన్న, రాజేందర్, మురళీధర్, ఫాజిల్, రాజేందర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ముడారపు పరమేశ్వర్, భూమన్న, ఎండీ.ఆసలం, సోషల్ మీడియా కన్వీనర్‌గా కృష్ణ, కల్చరల్ కమిటీ సభ్యులుగా గట్టు శ్రీనివాస్, అకడమిక్ కమిటీ సభ్యులుగా లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర పరిశీలకులుగా వెంకట్, లక్ష్మణరావు, ఎన్నికల అధికారిగా రాష్ట్ర బాధ్యులు సత్యానంద్ వ్యవరించారు.

సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలు శిశుమందిరాలు



సరస్వతీ శిశుమందిర్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ బాపూరావు

ముథోల్: సంస్కృతి, సంప్రదాయాలకు శ్రీసరస్వతీ శిశుమందిరాలు నిలయాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. ముథోల్‌లోని శ్రీసరస్వతీ శిశుమందిర్ నూతన భవన నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ విద్యార్థులకు పెద్దలపై గౌరవం, జీవితంపై ప్రణాళిక, చదువుపై ఇష్టం, దేశంపై ప్రేమ అలవర్చుతూ వారిని భావిభారత పౌరులుగా శిశుమందిరాలు తీర్చిదిద్దుతాయని వివరించారు. ప్రతీవ్యక్తి తన సంపాదనలో కనీసం ఒక శాతం సమాజ సేవకు ఖర్చు చేస్తే దొరికే ఆనందం వేరన్నారు. సమాజ సేవకు అందరూ ముందుకు రావాలని కోరారు. భవన నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాత సీబీఆర్ ప్రసాద్‌ను అభినందించారు. భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు కాగా, ఎంపీ రూ.లక్ష, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి రూ.51 వేలు, అయ్యన్నగారి భూమయ్య రూ.25 వేలు, గోపాల్ సార్డా రూ.25 వేలు, పెండెపు కాశీనాథ్ రూ.25 వేలు, తాటొల్ల రమేశ్ రూ.24 వేలు, భైంసా బజరంగ్ వ్యాయమ శాఖ కమిటీ రూ.5 వేలు, పూర్వ ఆచార్యులు రామారావు రూ.5 వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య క్షేత్ర సహ కార్యదర్శి వినోద్‌కుమార్, ప్రాంత కార్యదర్శి మక్కాల సీతారాములు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, డాక్టర్ దామోదర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, డాక్టర్ రాజేశ్వర్, పాఠశాల ప్రభందకారిణి సభ్యులు, ముథోల్ నియోజకవర్గంలోని శిశుమందిరం పాఠశాలల ప్రభందకారిణి సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



నిర్మల్ రూరల్: టీయూటీఎఫ్ 2023 క్యాలెండర్‌ను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీమనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, తొడిశెట్టి రవికాంత్, కోశాధికారి పోల ధర్మరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చొక్కారావు, ఉపాధ్యాయులు వాహిద్‌ఖాన్, శ్రీనివాస్, మతీన్, శివప్రసాద్, నాగమణి, శివరాణి, గోలి సాయన్న పాల్గొన్నారు.

‘నూతన’ లక్ష్యమే..

తీపి, చేదు జ్ఞాపకాలతో 2022 ముగిసింది. కొత్త ఆశయాలు, ఆలోచనలకు యువత, విద్యార్థులకు 2023 నూతన సంవత్సరం స్వాగతం పలుకుతోంది. తల్లిదండ్రుల కలలను సాకారం చేసే బాధ్యత వారిపై ఉంది. న్యూఇయర్‌ సందర్భంగా యువత, విద్యార్థుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

కరోనా మహమ్మారి పోవాలి



కరోనా కారణంగా గత రెండేళ్ల విద్యావ్యవస్థ కుంటుపడింది. గత మే నుంచి కేసులు తగ్గుముఖం పట్టాయి. మళ్లీ కరోనా భయం గుబులురేపుతోంది. ఈ ఏడాది కరోనా తగ్గుముఖం పట్టి అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నా.

– ఎస్‌.శ్రీజ, విద్యార్థిని, టీచర్స్‌ కాలనీ, ఆదిలాబాద్‌

సంకల్పంతో ముందుకు



కొత్త సంవత్సరం అనగానే అందరు పార్టీలు.. ఎంజాయ్‌మెంట్‌ అనుకుంటారు. నిజానికి కొత్త సంకల్పంతో ముందుకు సాగాలి. వాటిని ఏ విధంగా అమలు పర్చాలో లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. మనలో ఉన్న ప్రతిభను వెలికితీయాలి. సమసమాజ నిర్మాణానికి పాటుపడాలి.

– కె.జాహ్నవి, డైట్‌ విద్యార్థిని, ఆదిలాబాద్‌

కొత్త ఆశయాలతో..



అనుకున్న లక్ష్యాలను ఆచరణలో పెట్టేందుకు కష్టపడాలి. గత అనుభవాలను నెమరువేసుకుని ముందుకు సాగాలి. భావితర గురువులైన డైట్‌ విద్యార్థులు ఏ విధంగా బోధించాలనేది శిక్షణ పొందుతాం. దేశ భవిష్యత్తు తరగతి గదిలో ఉంది. డీఎడ్‌ పూర్తి చేసి టీచర్‌ కాలనేది లక్ష్యం. అందుకు అనుగుణంగా కష్టపడతాను.

– ఎం.జాహ్నవి, డీఎడ్‌ విద్యార్థిని, ఆదిలాబాద్‌

విలువలతో కూడిన ఆనందం



కొత్త సంవత్సరంలో తెలియని విషయాలను తెలుసుకోవాలని ఉంది. కొత్త ఆశయాలతో ముందుకు సాగుతాను. విలువలతో కూడిన ఆనందం పొందాలనుకుంటున్నాను. ఈ ఏడాది ఎలాంటి వ్యాధులు రాకుండా ఉండాలని, దేశం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నా.

– సి.కావ్య, విద్యార్థిని, శివాజీచౌక్‌, ఆదిలాబాద్‌

లక్ష్యంతో ముందుకు సాగుతా



విద్యార్థిలోకమందరికీ నూతన సంవత్సరం శుభాకాంక్షలు. కొత్త ఆశయాలతో ఈ ఏడాది ముందుకు సాగుతాం. ప్రతి విద్యార్థి ప్రయోజకులు కావాలని ఆశిస్తాను. సమాజానికి విద్యార్థి లోకం కీర్తి తెచ్చే విధంగా వ్యవహరించాలి. పోటీ పరీక్షలకు సిద్ధమై ఉద్యోగాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతాను. – బి.రాజేశ్వరి, విద్యార్థిని, సంజయ్‌నగర్‌, ఆదిలాబాద్‌ 31ఎడిబి409

కష్టపడి చదువుతా



విద్యార్థిలోకం క్రమశిక్షణ, పట్టుదల, ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో లక్ష్యాన్ని ఏర్పర్చుకొని చదువుకుంటే తప్ప అనుకున్న స్థాయికి చేరుకోలేం. గ్రూప్‌–1 అధికారి కావడమే నా ముందున్న లక్ష్యం. అందుకు అనుగుణంగా కష్టపడి చదువుతాను. మా అమ్మనాన్న కలలను సాకారం చేస్తా.

– మస్రాత్‌ ఉన్నీసా, విద్యార్థిని, ఆదిలాబాద్‌

సామాజిక కార్యక్రమాలు



నిర్మల్‌: గృహిణులుగా ఉంటూనే మా శ్రీసాయి/లవ్‌లీ మహిళ సంఘాల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేస్తున్నాం. ఈ ఏడాది సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని అనుకుంటున్నాం

– బి.కళ్యాణి, గృహిణి, నిర్మల్‌

పుస్తకాలు చదివేలా..



ప్రస్తుతం పుస్తకాలను చదివే వారి సంఖ్య చాలా తగ్గిపోయింది. కనీసం సెల్‌ఫోన్‌లో కూడా మంచి సాహిత్యాన్ని చదివే వారు తగ్గుతున్నారు. ఈ ఏడాది పుస్తకాలను చదివే వారి సంఖ్యను పెంచేందుకు ప్రయత్నిస్తా.

– ఎం.సంతోష్‌, నిర్మల్‌

ఉద్యోగం సాధించడమే లక్ష్యం



ఖానాపూర్‌: ప్రభుత్వం ఇటీవల వరుస ఉద్యోగ నోటిఫికేషన్లు వేయడం శుభసూచకం. చదువుతూనే ఉద్యోగం కోసం ప్రిపేర్‌ అవుతాను. మేము నలుగురం అక్కాచెల్లెళ్లం. తల్లిదండ్రులు కలల్ని నిజం చేస్తాం.

– మనీష, ఎంబీఏ, ఫైనాన్స్‌. సెకండియర్‌, మాసాయిపేట్‌, కడెం మండలం

‘భైరి’ వెనుక ఉన్నది బీఆర్‌ఎస్సే

- ఎంపీ సోయం బాపురావు



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపురావు

భైంసాటౌన్‌: అయ్యప్పస్వామి, హిందూదేవుళ్లపై భైరి నరేశ్‌ వ్యాఖ్యల వెనుక బీఆర్‌ఎస్‌ కుట్ర దాగి ఉందని ఆదిలాబాద్‌ ఎంపీ సోయంబాపురావు ఆరోపించారు. శనివారం సాయంత్రం భైంసాలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం పట్టుకుందని, రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఎంఐఎం పార్టీతో కలిసి ఇలాంటి కుట్రలకు తెరలేపిందన్నారు. భైరి నరేశ్‌పై రాష్ట్రవ్యాప్తంగా 150కిపైగా కేసులు నమోదైతే, పీడీ యాక్టు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. హిందూదేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవడంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు సరైన రీతిలో సమాధానం చెబుతారన్నారు. సమావేశంలో ఆదిలాబాద్‌ పార్లమెంట్‌ కన్వీనర్‌ అయ్యన్నగారి భూమయ్య, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి రామారావ్‌ పటేల్‌, నాయకులు బి.గంగాధర్‌, గోపాల్‌సర్డా, రవిపాండే, తదితరులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన పెరగాలి



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్‌, సీనియర్‌ సివిల్‌ న్యాయమూర్తి అజయ్‌ కుమార్‌

నిర్మల్‌టౌన్‌: ప్రజలందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.కర్ణకుమార్‌, సీనియర్‌ సివిల్‌ న్యాయమూర్తి అజేశ్‌కుమార్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టులో శనివారం మాట్లాడారు. నిర్మల్‌లో డిస్ట్రిక్ట్‌ లీగల్‌ సర్వీస్‌ అథారిటీ కోర్టును జనవరి 2న ప్రారంభిస్తామని తెలిపారు. ఇందుకోసం జూనియర్‌ కాలేజీలోని సబ్‌ కోర్టులో గదిని కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 23 జిల్లాల్లో ఈ కోర్టులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజల్‌ భుయాన్‌, న్యాయమూర్తి పి.నవీన్‌రావు, అడ్మినిస్ట్రేషన్‌ జడ్జి ఎస్‌.తుకారాంజీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని వివరించారు. ఈ కోర్టు ముఖ్య ఉద్దేశం గ్రామాలు, పట్టణాల్లో లీగల్‌ సర్వీసెస్‌పై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ఈ సర్వీసెస్‌ ద్వారా ప్రజలకు జరిగే న్యాయం గురించి వివరించడం జరుగుతుందన్నారు. కోర్టుకు చైర్మన్‌గా ప్రిన్సిపల్‌ సెషన్స్‌ జడ్జి, ఎక్స్‌ అఫీషియో మెంబర్స్‌గా కలెక్టర్‌, ఎస్పీ, చీఫ్‌ జ్యుడీషియల్‌ మేజిస్ట్రేట్‌, డిస్ట్రిక్ట్‌ గవర్నమెంట్‌ ప్లీడర్స్‌ వ్యవహరిస్తారని తెలిపారు. ప్రస్తుతం నిర్మల్‌ లీగల్‌ సర్వీస్‌ అథారిటీ కోర్టుకు ఇన్చార్జిగా సీనియర్‌ సివిల్‌ న్యాయమూర్తి అజేశ్‌కుమార్‌ బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్‌ ముషరఫ్‌ అలీ

- ఘనంగా ఏర్పాట్లు చేయాలి
- విద్యార్థులు, గైడ్‌ టీచర్లకు సౌకర్యాలు కల్పించాలి
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌ రూరల్‌: జనవరి 9 నుంచి 11వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనపై మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్‌ ముషరఫ్‌ అలీ అధ్యక్షతన అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రసాంకేతిక రంగాలపై ఆసక్తి, అభిరుచి కలిగించేందుకు విద్యావైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. గ్రామీణ జిల్లా అయిన నిర్మల్‌కు ఈ ఏడాది నిర్వహణ బాధ్యత రావడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఈ ప్రదర్శనను జనవరి 9న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లు ఘనంగా చేయాలని అధికారులను ఆదేశించారు. 33 జిల్లాల నుంచి వచ్చే విద్యార్థులకు, గైడ్‌ టీచర్లకు అసౌకర్యం కలుగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. వసతి, భోజన సదుపాయంపై ప్రత్యేక శ్రద్ధకనబర్చి, అన్ని సౌకర్యాలతో మంచి వసతి ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రదర్శన జరిగే మూడు రోజులు ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్‌ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, బాసర ట్రిపుల్‌ ఐటీ ప్రొఫెసర్లు, అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు.

మోడల్‌ పాఠశాలలను సిద్ధం చేయాలి

జనవరి 7వ తేదీలోపు జిల్లాలో మన ఊరు–మన బడి మోడల్‌ పాఠశాలలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యా ప్రమాణాలు పెంచడానికి ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. మొదటి దశలో మన జిల్లాలో 260 పాఠశాలలకు రూ.81 కోట్ల అంచనా వ్యయంతో పనులను ప్రారంభించామన్నారు. మండలానికి రెండు పాఠశాల చొప్పున మొత్తం 38 మోడల్‌ పాఠశాలలను ఈనెల 7 లోపు ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఇంజినీరింగ్‌ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జనవరి 9న రెండు పాఠశాలలను ప్రారంభించే అవకాశం ఉందన్నారు. అనంతరం డీఈవో రవీందర్‌రెడ్డి మన ఊరు–మన బడి పనులపై నాడు– నేడు ఫొటోలతో పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ఇచ్చారు. పనుల ప్రగతిని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు హేమంత్‌ బోర్కడే, రాంబాబు, మున్సిపల్‌ చైర్మన్‌ ఈశ్వర్‌, గ్రంథాలయ చైర్మన్‌ ఎర్రవోతు రాజేందర్‌, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి , ఈఈలు శంకరయ్య, అశోక్‌ కుమార్‌, సెక్టోరియల్‌ అధికారులు, ఎంఈవోలు, ఏఈలు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై అవగాహన ఉండాలి



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న డీఎస్పీ జీవన్‌ రెడ్డి



వాహనదారునికి విద్యార్థినితో రెడ్‌ రోజ్‌ ఇప్పిస్తున్న డీఎస్పి

నిర్మల్‌టౌన్‌: వాహనదారులందరూ ట్రాఫిక్‌ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ జీవన్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని మంచిర్యాల్‌ చౌరస్తాలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి శనివారం ట్రాఫిక్‌ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డోంట్‌ డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌, డోంట్‌ యూస్‌ మొబైల్‌ ఫోన్స్‌ వైల్‌ డ్రైవింగ్‌ అనే ప్లకార్డులను ప్రదర్శించారు. హెల్మెట్‌ ధరించిన వాహనదారులకు విద్యార్థులతో వైట్‌ రోస్‌, లేని వారికి రెడ్‌ రోస్‌ ఇప్పించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. ట్రాఫిక్‌ రూల్స్‌ పాటించకుండా అడ్డదిడ్డంగా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని తెలిపారు. హెల్మెట్‌ ధరించడం వలన ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాల ముప్పు నుండి తప్పించుకోవచ్చని తెలియజేశారు. ఫోన్‌ మాట్లాడుతూ డ్రైవింగ్‌ చేయొద్దని తెలిపారు. ఫోన్‌ వచ్చినప్పుడు బండిని పక్కన ఆపి మాట్లాడాలని సూచించారు. తాగి వాహనాలను నడిపితే ప్రమాదాలు జరిగి కుటుంబ సభ్యులకు తీరనిలోటు ఏర్పడుతుందన్నారు. ట్రాఫిక్‌ రూల్స్‌ అతిక్రమించిన వారి వాహనాలను జప్తు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ ఎస్సై రాజశేఖర్‌, శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ట్రాఫిక్‌ సిబ్బంది పాల్గొన్నారు.



రాయిసెంటర్ల సేవలు అభినందనీయం

- ఆదిలాబాద్‌ కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌



మాట్లాడుతున్న సిక్తా పట్నాయక్‌

ఉట్నూర్‌: ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ గూడేల్లో సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన రాయిసెంటర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆదిలాబాద్‌ కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌ అన్నారు. మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన రాయిసెంటర్ల 36వ వార్షికోత్సవ సమావేశానికి ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డితో కలిసి ఆమె హాజరయ్యారు. ముందుగా కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారికి ఆదివాసీ సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్‌ మాట్లాడారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 120 రాయిసెంటర్లు పనిచేస్తున్నాయని తెలిపారు. ఆదివాసీల జీవన విధానంతో మార్పులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా సంక్షేమ ఫలాలు అమలు చేస్తోందన్నారు. ఇటీవల రాష్ట్రంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ పర్యటన సందర్భంగా ఆదివాసీల జీవన విధానం గురించి వివరించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో గిరిజనులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు కేసీఆర్‌ న్యూట్రిషన్‌ కిట్లు అందిస్తున్నామన్నారు. ఉద్యాన పంటలు, వివిధ పంటల సాగు కోసం గిరిజన రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

ఏజెన్సీ ప్రాంతాల్లోని 2 వేల గిరిజన గ్రామాలను ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్‌ తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టార్స్‌ 50 శిక్షణ కేంద్రం ద్వారా విద్యార్థులకు ఉన్నత చదువులకు అవకాశం లభించేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 300 మంది గిరిజన రైతులకు గిరిజ వికాసం పథకం ద్వారా బోరు బావులు, విద్యుత్‌ మోటార్లు మంజూరు చేశామన్నారు. గోండు భాషా రక్షణ కోసం వివిధ రచనలు అనువాదం చేస్తామన్నారు. అనంతరం హైమన్‌ డార్ఫ్‌ 36వ వర్ధంతి సభ కరపత్రాలు ఆవిష్కరించారు. సమావేశంలో ఆదిమ గిరిజన సలహా మండలి చైర్మన్‌ కనక లక్కెరావ్‌, ఏపీవో పీటీజీ భాస్కర్‌, రాయిసెంటర్‌ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు దుర్గు పటేల్‌ పాల్గొన్నారు.

బైక్‌లను ఢీకొన్న కారు

- ఇద్దరికి తీవ్ర గాయాలు

భైంసారూరల్‌: మండలంలోని తిమ్మాపూర్‌ వద్ద ఓ కారు బైక్‌లను వెనుక వైపు నుంచి ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. కుంటాల మండలం అందకూర్‌కు చెందిన ప్రణయ్‌, శ్రీనివాస్‌ బైక్‌లపై గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో లోకేశ్వరం మండలం పాట్‌పెల్లికి చెందిన లక్ష్మణ్‌ కారులో వెనుకవైపు నుంచి ఢీకొన్నారు. ఈ ఘటనలో బైక్‌లపై ప్రయాణిస్తున్న శ్రీనివాస్‌, ప్రణయ్‌కు తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో నిర్మల్‌ ఆస్పత్రికి తరలించారు.

‘నరేశ్‌ను శిక్షించాలి’

సారంగపూర్‌: హిందూ దేవతలు, అయ్యప్పస్వామిని దూషించిన భైరి నరేశ్‌పై చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని అయ్యప్ప సేవాసమాజం సభ్యులు శనివారం డిమాండ్‌ చేశారు. ఈసందర్భంగా మండలంలోని బోరిగాం గ్రామంలో నరేశ్‌ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వాములు నరేష్‌, మహేందర్‌, బోరిగాం గ్రామస్తులు ఉన్నారు.





దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్‌: జిల్లా స్థాయి వక్ఫ్‌ ఆస్తుల పరిరక్షణకు సమన్వయ కమిటీ ఏర్పాటుకు సంబంధిత జిల్లా అధికారులతో పాటు, అవగాహన కలిగిన ముస్లిం మహిళ సభ్యురాలి కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి పేర్కొన్నారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో జనవరి 5లోగా దరఖాస్తులు అందించాలని తెలిపారు.

దళితులు రాజ్యాధికారం సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నస్పూర్‌: దళితులు ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికారం సాధించాలని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్‌ అన్నారు. శనివారం ఆయన నాయకులతో కలిసి నస్పూర్‌ శ్రీరాంపూర్‌ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. అంబేద్కర్‌ సందేశ్‌ యాత్రలో భాగంగా నస్పూర్‌లో పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దళితులకు ఆత్మ గౌరవం, సామాజిక న్యాయం, రాజ్యాధికారం సాధించడమే తమ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. పెద్దపల్లి ఇన్‌చార్జి రమేశ్‌చంద్ర, బెల్లంపల్లి ఇన్‌చార్జి గంధం శంకర్‌, అధికార ప్రతినిధి పులి రాజారాం, నాయకులు శ్రీనివాస్‌, చిప్పరి కరుణాకర్‌, రమేశ్‌ పాల్గొన్నారు.

